రూ.42 కోట్లు దొరికిన బెంగళూరులో ఆత్మానంద కాలనీలోని అంబికాపతికి చెందిన ఫ్లాట్

డబ్బును తెలంగాణకు తరలిద్దామనుకొన్న కారు.. శేఖర్‌రెడ్డి

కర్ణాటకలో కట్టల గుట్టలు

బెంగళూరులో కాంగ్రెస్ నేత ఇంట్లో 42 కోట్లు

- బెడ్‌రూంలో 23 బాక్సుల్లో దాచిన అక్రమ సొమ్ము
- పక్కా సమాచారంతో పట్టుకొన్న ఐటీ అధికారులు
- డబ్బు దొరికిన ఇల్లు కాంగ్రెస్ నేత అంబికాపతిది
- డిప్యూటీ సీఎం శివకుమార్‌కు ఈయన సన్నిహితుడు
- కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసమూర్తికి స్వయానా బావ
- తెలంగాణ ఎన్నికల్లో పంచేందుకేనని అనుమానాలు
- చెన్నై మీదుగా హైదరాబాద్‌కు తరలించే ప్లాన్
- తెలంగాణ ఎన్నికల కోసం కర్ణాటకలో బలవంతపు వసూళ్లు!
- బలవంతపు వసూళ్లపై కోడై కూస్తున్న కన్నడ మీడియా
- పట్టుబడిన డబ్బుపై నోరు మెదుపని కాంగ్రెస్

గురువారం (12-10-2023) సాయంత్రం 6 గంటల సమయం.. బెంగళూరులోని ఆదాయం పన్ను విభాగం ఆఫీస్‌లో ఫోన్ మోగింది. పనులు ముగించుకొని ఇండ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న అధికారుల్లో ఒకరు ఫోన్ ఎత్తి హలో చెప్పండి అన్నాడు. సార్.. సుల్తాన్‌పాళ్య ప్రాంతంలోని ఆత్మానంద కాలనీలో ఓ ఇంట్లో కట్టకొద్దీ డబ్బు ఉన్నది. మీరు ఇప్పుడే వెళ్తే పట్టుకోవచ్చు. ఇంకో గంట ఆలస్యమైతే ఆ డబ్బంతా రాష్ట్రం దాటి వెళ్లిపోతుంది అని అవతలి వ్యక్తి ఆతృతగా చెప్పడు. వారం రోజులుగా రాష్ట్రంలో వరుస సోదాలు నిర్వహిస్తున్న ఐటీ విభాగానికి రోజూ ఇలాంటి ఫోన్లు వస్తూనే ఉన్నాయి. ఇది కూడా ఓ సాధారణ ఫోన్‌కాల్ అనుకున్నాడు అధికారి. యథాలాపంగా ఆ ఇంటి అడ్రస్‌తోపాటు మరికొన్ని వివరాలు కనుక్కొని ఫోన్ పెట్టేశాడు. మహా అయితే ఆ ఇంట్లో ఏ కోటో, రెండు కోట్ల రూపాయలో ఉండొచ్చులే అనుకొన్నాడు. కానీ, ఫోన్ చేసిన వ్యక్తి కచ్చితంగా, నమ్మకంగా చెప్పటంతో అనుమానం వచ్చి ఆలస్యం చేయకుండా తన టీంతో కలిసి 15 నిమిషాల్లోనే ఆ ఇంటికి చేరుకొని సోదాలు మొదలు పెట్టారు.

బెడ్‌రూంలో బెడ్ కింద చాలా అట్టపెట్టెలు కనిపించటంతో తెరిచి చూసిన అధికారులు బిగుసుకుపోయారు. ఎటు చూసినా డబ్బే.. ఏ పెట్టెలో చూసినా రూ.500 నోట్ల కట్టలే. వాటిని చేత్తో లెక్కపెట్టడం సాధ్యకాదని మనీ కౌంటింగ్ మెషిన్ తెప్పించి లెక్కించారు. ఆ డబ్బాల్లో ఉన్నది అక్షరాలా రూ.42 కోట్లు.. ఆ ఇల్లు కర్ణాటక కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అఖండ్ శ్రీనివాసమూర్తికి స్వయానా అక్క అయిన అశ్వతమ్మది. ఆమె భర్త బృహన్ బెంగళూరు మహానగర పాలికె కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్ అంబికాపతి. లోతుగా కూపీ లాగితే ఈ డబ్బంతా చెన్నై మీదుగా హైదరాబాద్ తరళించేందుకు సిద్ధం చేశారని తేలింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీయే ఈ డబ్బు తరలిస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): స్కాంగ్రెస్ కరెన్సీ లీలలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకొని గెలువలేమని తేలిపోవటంతో పచ్చనోట్లతో ప్రజల కండ్లకు గంతలు కట్టేందుకు సిద్ధమైంది. అందుకోసం ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచి గుట్టలకొద్దీ డబ్బు తెలంగాణకు వరదలా పారిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం రాత్రి బెంగళూరులో ఓ కాంగ్రెస్ నేత ఇంట్లో పట్టుబడిన డబ్బే ఇందుకు ఉదాహరణ అని అంటున్నారు. తెలంగాణలో ఓటర్లకు పంచేందుకు కాంగ్రెస్ పార్టీ ఆ డబ్బును సిద్ధం చేసిందని వార్తలు వస్తున్నాయి. వీటిని కర్ణాటక కాంగ్రెస్ పెద్దలు నేరుగా ఖండించకపోవటం గమనార్హం. మరో గంటలో హైదరాబాద్‌కు బయలుదేరాల్సిన సొమ్ము ఐటీ అధికారుల చేతికి చిక్కటంతో కాంగ్రెస్ నేతలు తేలుకుట్టిన దొంగలా గప్‌చుప్ అయిపోయారు.

అసలేం జరిగిందంటే?

పంచాయతీ ఎన్నికలతో పాటు, ఐదు రాష్ట్రాల ఎన్నికలకు అక్రమ సొమ్మును తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో కర్ణాటకలోని పలువురు కాంట్రాక్టర్లు, ఆభరణాల షాపుల యజమానులు, రాజకీయ నాయకుల ఇండ్లల్లో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరులో సుల్తాన్‌పాళ్య ప్రాంతంలోని ఆత్మానంద కాలనీలో ఉన్న ఓ ఇంట్లో పెద్దమొత్తంలో అక్రమ సొమ్ము దాచిపెట్టారని ఐటీ అధికారులకు ఓ వ్యక్తి సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకొన్న అధికారులు ఆ ఇంట్లోని ఓ గదిలో 23 అట్టపెట్టెల్లో రూ.42 కోట్ల అక్రమ నగదును గుర్తించారు. కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకొన్నారు. సొమ్ము దొరికిన ఇల్లు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అఖండ్ శ్రీనివాసమూర్తి సోదరి అశ్వతమ్మది. ఆమె భర్త అంబికాపతికి బృహన్ బెంగళూరు మహానగర పాలికె కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు. కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ పెద్దలు ప్రతి టెండర్‌లోనూ 40 శాతం కమీషన్ తీసుకొంటున్నారని ఆరోపించి వార్తల్లో నిలిచిన వ్యక్తి ఈయనే. అశ్వతమ్మ మాజీ కార్పొరేటర్ కూడా. డబ్బు విషయమై అంబికాపతిని, అశ్వతమ్మను అధికారులు ప్రశ్నిస్తున్నారు. వారి వ్యాపార, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని సేకరిస్తున్నారు. వారికి సంబంధించిన ఐదుకు పైగా ప్రాంతాల్లోని ఇండ్లు, కార్యాలయాల్లో శుక్రవారం కూడా సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం ఈ కేసు ఐటీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి బదిలీ చేసినట్టు సమాచారం.

కాంగ్రెస్ నేత అంబికాపతి

బెంగళూరులో సుల్తాన్‌పాళ్య ప్రాంతంలోని అంబికాపతికి చెందిన మరో ఇల్లు

తాళం చెవి లేదంటూ

సోదాల సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. డబ్బు ఐటీ అధికారుల కంట పడకుండా కాపాడుకొనేందుకు ఇంట్లోనివారు విశ్వప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. వాస్తవానికి డబ్బు దొరికిన ఫ్లాట్ అంబికాపతిది అయినప్పటికీ, ఆయనకు వరుసకు సోదరుడయ్యే వ్యక్తి అందులో ఉంటున్నాడు. సోదాల కోసం అధికారులు రాగానే బెంబేలెత్తిపోయిన ఆ వ్యక్తి.. వారిని లోపలికి వెళ్లకుండా అడ్డుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు సమాచారం. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వెళ్లి సోదాలు మొదలుపెట్టిన అధికారుల బెడ్‌రూంకు తాళం వేసి ఉండటా న్ని గమనించారు. ఇంట్లో మనుషులుండగా బెడ్‌రూంకు తాళం ఎందుకు వేశారని నిలదీయటంతో ఆ వ్యక్తి నీళ్లు నమిలాడు. తాళం తీయాలని అధికారులు ఆదేశించటంతో తనవద్ద లేదని, డ్రైవర్ వద్ద ఉన్నదని బదులిచ్చాడు. ఆశ్చర్యపోయిన అధికారులు యజమాని ఇంటి పడకగది తాళం చెవులు కారు డ్రైవర్ వద్ద ఉండటమేమిటని నిలదీశారు. అప్పుడే ఐటీ అధికారులకు ఇక్కడే పెద్ద వ్యవహారమే ఉన్నదని అనుమానం వచ్చింది. ఆయన పొంతనలేని సమాధానాలు చెప్తుండటంతో డ్రైవర్‌ను రప్పించి తలుపులు తెరువాలని గట్టిగా ఆదేశించారు. అప్పటికీ ఆ ఇంట్లో ని వ్యక్తి సహకరించకపోవటంతో డ్రైవర్ ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేసి అతన్ని ఇంటికి రప్పించి గది తలుపులు తెరిచారు. అక్కడ ఉన్న డబ్బు గుట్టలను చూసి విస్తుపోయారు.

రూ. 8 కోట్లు ఇప్పటికే తరలింపు?

ఐటీ అధికారులు మొత్తంగా రూ.50 కోట్ల అక్రమ సొమ్మును పట్టుకోవాల్సి ఉన్నదని.. అయితే, ఇప్పటికే రూ.8 కోట్లు రాష్ట్రం నుంచి అప్పటికే తరలించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఆ సొమ్ము తెలంగాణ ఎన్నికల్లో వినియోగించనున్నట్టు అనుమానిస్తున్నారు.

బెంగళూరు టూ తెలంగాణ వయా చెన్నై

బెంగళూరులో దొరికిన 42 కోట్ల అక్రమ సొమ్మును చెన్నై గుండా తెలంగాణకు తరలించడానికి నిందితులు ప్రయత్నించినట్టు స్థానిక మీడియా పేర్కొన్నది. శేఖర్‌రెడ్డి అనే వ్యక్తిని ఈ పనికి పురమాయించినట్టు తేలింది. కేఏ04ఎన్ఏ5959 నంబర్‌గల కారును ఇందుకోసం వాడుకోవాలనుకొన్నట్టు తెలిసింది. గంటలో డబ్బును తరలించాలని యత్నించగా, ఐటీ అధికారులు వచ్చిపడటంతో కుట్ర బయటపడింది.

ఎవరీ శేఖర్‌రెడ్డి?

అంబికాపతికి అత్యంత నమ్మకస్తుడైన వ్యక్తి శేఖర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఆయన కొనసాగుతున్నట్టు స్థానిక మీడియా వెల్లడించింది. అంబికాపతితో పాటు పార్టీలోని పలువురు కీలక నేతలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను, నగదు తరలింపు కార్యక్రమాలను ఇతనే నిర్వహిస్తాడని తెలుస్తున్నది.

అక్రమ సొమ్ము ఎలా వచ్చింది?

కర్ణాటకలోని గత బీజేపీ సర్కారు కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్‌ను వసూలు చేసిందనే ఆరోపణలున్నాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అంతకు మించి అన్నట్టు 50 శాతం కమీషన్‌ను వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. 'ఎలక్షన్ టాక్స్' పేరుతో డబ్బులు వసూలు చేసి దానిని తెలంగాణకు పంపే కుట్ర జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో అంబికాపతి కీలక పాత్ర పోషించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా లక్షిత వ్యక్తులకు కాంట్రాక్టులు ఇప్పించి.. ఆయా టెండర్లలో 5.5 శాతం నుంచి 50 శాతం వరకు కమీషన్ వసూలు చేసినట్టు వార్తలు వచ్చాయి. బీజేపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన కాంట్రాక్టులకు బిల్లుల విడుదల కోసం కూడా కమీషన్‌ను డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. తాజాగా దొరికిన సొమ్ము అలాగే వచ్చినట్టు అనుమానిస్తున్నారు. కాంట్రాక్టర్లు, బిల్డర్లు, వ్యాపారుల పాత్ర కూడా ఇందులో ఉన్నట్టు తెలుస్తున్నది. కర్ణాటక కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా అంబికాపతి, ఆయన సన్నిహితుడు కెంపన్న అధ్యక్షుడిగా కొనసాగుతుండటంతో ఈ కమీషన్ వ్యవహారం బయటకు పొక్కలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇది బీజేపీ కుట్ర: డీకే శివకుమార్

చివరి నిమిషయంలో ప్లాన్ బెడిసికొట్టడంతో కర్ణాటక ప్రభుత్వ పెద్దలు రగిలిపోతున్నట్టు సమాచారం. 'ఈ డబ్బుతో తమకు సంబంధం లేదు' అని ఏ కాంగ్రెస్ నేతా ప్రకటించలేదు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆ డబ్బు తమదేనని పరోక్షంగా అంగీకరించేలా మాట్లాడారు. 'బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు సహజం. బీజేపీ అధికారంలో ఉంటే సోదాలే జరుగవు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మీడియాపై చిటపటలాడారు. 'ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు మేం డబ్బు తరలిస్తున్నామని చూశారా? బీజేపీవాళ్లు చూశారా? మమ్మల్ని ఏ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కూడా డబ్బు పంపాలని అడగలేదు. అడిగినట్టు మీరేమైనా చూశారా?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎవరీ అంబికాపతి?

కాంగ్రెస్ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అంబికాపతి అత్యంత సన్నిహితుడు. బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్పతో కూడా అంబికాపతికి మంచి సంబంధాలున్నాయి. అంబికాపతి సతీమణి అశ్వతమ్మ కాంగ్రెస్ నేత ఆఖండ శ్రీనివాసమూర్తికి అక్క. కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంబికాపతి ప్రస్తుతం కర్ణాటక కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. గత పదేండ్లలో కాంట్రాక్టు టెండర్లలో ఎక్కువగా పాల్గొనని అంబికాపతి.. రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. కాంగ్రెస్ కీలక నేతల ఆర్థిక లావాదేవీలన్నీ అంబికాపతి, ఆయన బంధువులు చూసుకొంటారని సమాచారం. '40 శాతం కమీషన్ రాజ్'తో కర్ణాటకలోని గత బీజేపీ సర్కారు అక్రమాలకు పాల్పడుతున్నదంటూ ఆరోపించిన కాంట్రాక్టర్ల సమూహంలో అంబికాపతి కీలక పాత్ర పోషించారు. మాజీ మంత్రి మునిరత్నపై అవినీతి ఆరోపణలు చేసిన కేసులో అంబికాపతి అరెస్టయ్యారు.

టీ కాంగ్రెస్ @ కర్ణాటక!

టికెట్ల నుంచి డబ్బు సంచుల దాకా అక్కడి నుంచే

ఆ 42 కోట్లు తెలంగాణ కోసమే!..

తెలంగాణ పార్టీని శాసిస్తున్న కన్నడ కాంగ్రెస్ నేతలు

తెలంగాణ కాంగ్రెస్‌ను ఆ పార్టీకి చెందిన కర్ణాటక నేతలు నడిపిస్తున్నట్టు తెలుస్తున్నది. టికెట్ల ఖరారు నుంచి ఎన్నికల ఖర్చుల దాకా కర్ణాటక నుంచే తరలిస్తున్నారు. కర్ణాటక నుంచి తెలంగాణకు డబ్బుల సంచులు తరలిస్తున్నారని నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణ శుక్రవారం అక్షర సత్యమని తేలింది. తెలంగాణ కాంగ్రెస్‌కు అధిష్ఠానం ఢిల్లీలో ఉందా? లేక బెంగళూరులోనా? అన్నది ఆ పార్టీ శ్రేణులకే అంతుబట్టకుండా ఉన్నది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు తెలంగాణలో కూడా పార్టీని గట్టెక్కించే బాధ్యతను అధిష్ఠానం పెద్దలు అప్పగించినట్టు తెలుస్తున్నది. తెలంగాణలో పోటీ చేసే అభ్యర్థులను ఢిల్లీలో ఖరారు చేస్తున్నట్టు బిల్డప్ ఇస్తున్నారు తప్ప వ్యవహారమంతా కర్ణాటక నుంచే నడిపిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ కర్ణాటకలోనే జరుగుతున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం కావాలనుకుంటున్న పార్టీలు, టికెట్ ఆశిస్తున్న ఆశావహులంతా బెంగళూరుకే వెళ్తున్నారు. పార్టీకి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చే బాధ్యతను కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేపట్టారు. ఆ మేరకు ఆయన ఏర్పాట్లు కూడా చేసినట్టు తెలుస్తున్నది. బెంగళూరులో గురువారం ఐటీ అధికారులకు దొరికిన రూ.42 కోట్లు తెలంగాణకు తరలించేందుకు దాచినట్టు సమాచారం. ఈ సొమ్ము పట్టిబడింది డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన అంబికాపతి, ఆయన భార్య ఆశ్వత్త ఇంట్లోనే కావడం గమనార్హం. కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వాన్ని 40 శాతం పర్సంటేజీ సర్కార్‌గా విమర్శించి గద్దెనెక్కిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు 50శాతం టార్గెట్‌గా పెట్టి కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తున్నట్టు బాహాటంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా వసూలు చేసిన సొమ్ముతో తెలంగాణలో ఎలాగైనా గెలవడానికి కర్ణాటక నేతలు ప్రయత్నిస్తున్నారు. అవే కాకుండా ఇక్కడ తెలంగాణలో టిక్కెట్లు ఆశిస్తున్న ఆశావాహుల నుంచి కూడా కోట్లకు కోట్లు వసూలు చేసి వాటిని నియోజకవర్గాలకు తరలిస్తున్నట్టు సమాచారం.

'డీకే' ను కలవండి?

తెలంగాణలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని ఢిల్లీ వెళ్లిన నేతలను పార్టీ పెద్దలు బెంగళూరుకు వెళ్లి డీకే కలవాలని చెప్తున్నారు. వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైస్ షర్మిల ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆమె బెంగళూరు వెళ్లి డీకే శివకుమార్‌ను కలిశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల మంత్రాంగమంతా బెంగళూరు నుంచే జరుగుతుందనడానికి ఇంతకంటే ఏమి నిదర్శనం కావాలని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల నాగేశ్వరరావు, ఆ పార్టీలో చేరడానికి ప్రయత్నించిన మోత్కుపల్లి నర్సింహులు బెంగళూరుకే వెళ్లి డీకేతో మంతనాలు జరిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీ, వీహెచ్ హనుమంతరావు తదితరులు ఢిల్లీ కంటే బెంగళూరు చుట్టే ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, డీకే శివకుమార్ తెలంగాణలో కాంగ్రెస్‌ను శాసించే స్థాయికి చేరుకోవడంతో భవిష్యత్‌లో జరిగే పరిణామాల పట్ల తెలంగాణవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓటుకు నోటు 2.0!

ఓటర్లకు నోట్లతో ఎర వేసేందుకు కాంగ్రెస్ కుట్ర

నగదును కర్ణాటక నుంచి తరలించే ఏర్పాట్లు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనమండలికి 2015లో జరిగిన ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకొనేందుకు నాటి టీడీపీ నేత, నేటి పీసీసీ అధ్యక్షుడు..రేవంత్‌రెడ్డి డబ్బులు ఎరవేయడం రాష్ట్రంలో 'ఓటుకు నోటు' తొలి కేసుగా నమోదైంది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అదే ఎత్తు వేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణలో ఓటర్లను డబ్బుతో ప్రలోభపెట్టేందుకు అవసరమైన నగదును కర్ణాటక నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న కర్ణాటక నేతలు ఇక్కడ ఎన్నికలకు అవసరమైన ఖర్చును కూడా అక్కడి నుంచే పంపుతున్నట్టు తెలుస్తున్నది. బెంగళూరులో ఐటీ అధికారులు గురువారం రాత్రి కాంగ్రెస్ నేత అంబికాపతి ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అంబికాపతి కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడు. దీంతో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న డీకే శివకుమార్ ఆ డబ్బును ఇక్కడికి పంపేందుకే తన సన్నిహితుని వద్ద దాచినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎనిమిదేండ్ల క్రితం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల కోటాలో తమ అభ్యర్థిని గెలిపించుకొనేందుకు నాటి టీడీపీ నేత రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌కు చెందిన నామినేటెడ్ సభ్యుడు స్టీఫెన్సన్‌కు కోట్ల రూపాయలు ఎరవేశారు. అందులో భాగంగా రూ. 50 లక్షలను స్టీఫెన్సన్ ఇంటికి తీసుకెళ్లిన రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన సంగతి తెలిసిందే. నేడు కాంగ్రెస్ పార్టీ సామాన్య ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అదే తరహాలో ప్రయత్నిస్తున్నదని, ఇది 'ఓటుకు నోటు 2.0' అవుతుందేమోనంటున్న నెటిజన్ల వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది.

కర్ణాటక సొమ్ముతో కుట్రలు

తెలంగాణ పుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కర్ణాటక అక్రమ సొమ్ముతో తెలంగాణలో గెలిచేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతున్నదని తెలంగాణ పుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ ఒక ప్రకటనలో విమర్శించారు. బెంగళూరులోని ఓ కాంగ్రెస్ నేత ఇంటిలో పట్టుబడ్డ రూ.42 కోట్లు ఎక్కడివని, హైదరాబాద్ తరలించేందుకు సిద్ధంగా ఉంచిన అక్రమ సొమ్ము కాదా అని ప్రశ్నించారు. సొమ్ముతో ఇక్కడ గెలువాలని హస్తం నేతలు కలలు కంటున్నారని, ఎన్నికోట్లు ఖర్చు పెట్టినా తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు అసాధ్యమని తేల్చిచెప్పారు.

కర్ణాటక నుంచి 1500 కోట్లు

ఐటీ దాడుల్లో దొరికింది రూ.42 కోట్లే

- అక్కడున్నది 50% కమీషన్ ప్రభుత్వం
- దొడ్డిదారిన తెలంగాణకు డబ్బులు
- ఎన్నికల్లో అడ్డదారులు ఆ పార్టీ నైజం
- అభ్యర్థులను నిర్ణయించుకోలేని దుస్థితి
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- తెలంగాణలో బీఆర్ఎస్‌దే హ్యాట్రిక్ విజయమని వెల్లడి

మెదక్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

మెదక్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో దోచుకుంటున్న సొమ్మును తెలంగాణకు తరలిస్తూ కాంగ్రెస్ నేతలు అడ్డంగా దొరికిపోయారని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. దాదాపు రూ.1,500 కోట్లు తరలించే ప్లాన్ చేయగా, రూ.42 కోట్లను ఐటీ అధికారులు సీజ్ చేశారని తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడటం, ఎన్నికల్లో అడ్డదారులు తొక్కడం కాంగ్రెస్ నైజం అని విమర్శించారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డితో కలసి మంత్రి మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. అక్రమంగా సంపాదించిన అవినీతి సొమ్మును తెలంగాణకు తరలించి, ఆ డబ్బు పంచి గెలవాలని కుట్రలు చేస్తున్నదని హరీశ్ ఆరోపించారు. కర్ణాటకలో గతంలో 40 శాతం కమీషన్ ప్రభుత్వం ఉంటే, ప్రస్తుతం 50 శాతం కమీషన్ ప్రభుత్వం వచ్చిందని ఎద్దేవా చేశారు. గత బీజేపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న అంబికాపతి ఆ రోజుల్లో 40 శాతం కమీషన్ సర్కారు అంటూ పోస్టర్లు వేసి దుమారం లేపారని గుర్తుచేశారు. ఈ రోజు అదే అంబికాపతి 50 శాతం కమీషన్ వసూల్ చేసి తెలంగాణకు తరలించే ప్లాన్ చేశారని, అయితే వారింట్లో ఐటీ అధికారులు జరిపిన దాడుల్లో రూ.42 కోట్లు పట్టుబడ్డాయని వివరించారు. కర్ణాటకలో బిల్డర్లు, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్, కాంట్రాక్టర్ల వద్ద నుంచి సుమారు రూ.1500 కోట్లు వసూలు చేసి చెన్నై మీదుగా హైదరాబాద్‌కు తరలించి అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చు పెట్టాలని కాంగ్రెస్ ప్లాన్ చేసిందని పేర్కొన్నారు. అటు.. ఇప్పటికీ అభ్యర్థులను నిర్ణయించుకోలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉన్నదని, సగం సీట్లలో అభ్యర్థులు లేరని మంత్రి హరీశ్ విమర్శించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినా ఆ పార్టీ టికెట్లు డిక్లేర్ చేయలేదని, అభ్యర్థులు దొరక్క పక్క పార్టీ నుంచి వస్తే టిక్కెట్లు ఇస్తామని ఎదురుచూస్తున్నదని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఎన్ని కలలు కన్నా తెలంగాణలో బీఆర్ఎస్‌దే హ్యాట్రిక్ విజయమని స్పష్టం చేశారు.

లాకర్లలో 500 కోట్లు

- అదంతా కాంగ్రెస్ నేతల సొమ్మే
- రాజస్థాన్‌లో బీజేపీ ఎంపీ కిరోడి ఆరోపణ
- లాకర్లు తెరిస్తే, వాస్తవాలు బయటకొస్తాయని పట్టు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో అట్టపెట్టెల్లో 42 కోట్ల అక్రమ సొమ్ముతో అడ్డంగా దొరికిపోయిన స్కాంగ్రెస్.. రాజస్థాన్ ఎన్నికల్లోనూ ఇదే తరహా కుట్రకు తెరతీసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ ఎంపీ కిరోడి లాల్ మీనా శుక్రవారం చేసిన సంచలన ఆరోపణలు ఈ వాదనకు మరింత బలాన్ని ఇస్తున్నాయి. జైపూర్‌లోని ఎంఐ రోడ్డులో ఉన్న గణపతి ప్లాజాలోని ఓ ఫ్లాట్‌లో 100 ప్రైవేట్ లాకర్లు ఉన్నాయని, వాటిలో రూ.500 కోట్ల నల్లధనం, 50 కిలోల బంగారం ఉన్నదని కిరోడి లాల్ మీనా ఆరోపించారు. పోలీసులు ఈ లాకర్లను తెరవాలని డిమాండ్ చేశారు. లాకర్లు తెరిచే వరకు తాను గేటు వద్దే కూర్చొని ధర్నా చేస్తానని ప్రకటించారు. లాకర్లు ఉన్న గదిని మీడియాకు చూపించారు. అయితే, శుక్రవారం రాత్రివరకూ ఆ లాకర్లను తెరువడానికి రాజస్థాన్ పోలీసులు రాకపోవడం గమనార్హం. కిరోడి మీనా రానున్న రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో సవాయ్ మాధోపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే.

పేపర్ లీక్ స్కామ్ సొమ్మే

లాకర్లు ఉన్న గది ముందు మీడియాతో మాట్లాడిన కిరోడి.. లాకర్లు ఎవరివ